క్లుప్తంగా

కనుల పండువగా గరుడ సేవ



చేబ్రోలు: చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని శ్రీ భూ నీలా సమేత ఆదికేశవ స్వామి దేవస్థానంలో శనివారం రాత్రి పున్నమి గరుడ సేవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం శ్రీధర్ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు జరిగాయి. శ్రావణ పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన గరుడ సేవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆదికేశవ స్వామికి ప్రత్యేక పూజలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. స్వామివారి గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. గరుడ సేవలో ఆదికేశవ స్వామి గ్రామంలోని పురవీధులలో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

దేశమాంబ అమ్మవారికి శ్రావణ పౌర్ణమి పూజలు



మంచాల(చేబ్రోలు): మంచాల గ్రామంలోని గ్రామ దేవత దేశాంబ అమ్మవారికి శనివారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామం సుఖ శాంతులతో ఉండాలని కోరుతూ జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలకు గ్రామస్తులతో పాటు, వివిధ గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

వెన్నుపోటులో చంద్రబాబు సిద్ధహస్తుడు

తురకపాలెం, మల్లవరం గ్రామాల్లో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'

గుంటూరు రూరల్: వెన్నుపోటు పొడవటంలో చంద్రబాబు సిద్ధహస్తుడని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రూరల్ మండలం కన్వీనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి (ఏఎస్ఆర్), ఎంపీపీ ఇంటూరి పద్మావతి అంజిరెడ్డి పేర్కొన్నారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని ఆదేశాలతో శనివారం మండలంలోని తురకపాలెం, మల్లవరం గ్రామాల్లో బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల సమయంలో సూపర్ సిక్స్ అమలు చేస్తామని, ఆదాయాన్ని సృష్టిస్తామని అబద్ధాలు చెప్పి గద్దెనెక్కి నేడు పథకాలు అమలు చేయకుండా రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచాడన్నారు. సంపద సృష్టిస్తానని చెప్పి విద్యుత్ చార్జీలను పెంచి పేదలు, రైతులను నిలువునా మోసం చేశాడన్నారు. సంపద సృష్టి పేరుతో గ్రామాల్లో వీధికి నాలుగు బెల్ట్ షాపులను నిర్వహిస్తూ మద్యాన్ని ఏరులా పారించి పేదల కష్టాన్ని దోచుకుంటున్నాడన్నారు. చంద్రబాబుకు పేదలు సంతోషంగా ఉంటే నచ్చదని పేదలను అణగదొక్కేందుకు ఎల్లపుడూ చూస్తుంటాడన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా నేటికీ ఒక్క పథకాన్ని కూడా సక్రమంగా అమలు చేయలేకపోయారన్నారు. దానికితోడు నిత్యం వేల కోట్ల అప్పులు చేసి రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రగా మార్చారన్నారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, కొండా కోటిరెడ్డి, మెట్టు నాగిరెడ్డి, దాసరి నాగరాజు, నాగేశ్వరరావు, నక్కా నాగేశ్వరరావు, పేరేచర్ల శివశంకర్, మల్లవరం సర్పంచ్ సామ్రాజ్యం, జగన్ మోహన్‌రెడ్డి, ఉషారాణి, కార్యకర్తలు పాల్గొన్నారు.



తురకపాలెంలో క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, గ్రామస్తులు

ఏకలవ్యుని స్ఫూర్తితో ఎరుకుల సమాజాభివృద్ధి

జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు మేడా లక్ష్మయ్య

గుంటూరు రూరల్: తమ జాతి గుండె చప్పుడు, కులదైవం ఏకలవ్యుని స్ఫూర్తితో దశాబ్దాలుగా విద్య, రాజకీయ సామాజిక రంగాలలో వెనుకబడి ఉన్న ఎరుకుల సమాజాభివృద్ధికి కృషి చేస్తామని జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం అధ్యక్షుడు మేడా లక్ష్మయ్య పేర్కొన్నారు. జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవం సందర్భంగా శనివారం అమరావతి రోడ్డు నగరాలు ప్రధాన వీధిలో గల ఏకలవ్యుని విగ్రహానికి పెద్దఎత్తున పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కృష్ణ హాస్పిటల్ అండ్ ల్యాబ్స్ జనరల్ మల్టీ స్పెషాలిటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని స్థానిక కార్పొరేటర్ నూకతోటి బాలాజీతో ప్రారంభించారు. వైద్య శిబిరంలో ప్రభుత్వ ఆసుపత్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బుచ్చిబాబు, జనరల్ ఫిజీషియన్ ఎం.ఆదం ఖాన్, డాక్టర్ దామర్ల ఆషా తదితర వైద్యులచే సాధారణ వైద్య సేవలతో పాటు గర్భిణులకు పరీక్షలు, షుగర్, బీపీ, థైరాయిడ్, గుండె, దంత, చర్మ, ఎముకల వైద్య నిపుణులు ఉచిత వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు మేడా హనుమంతరావు, ఉపాధ్యక్షుడు ఉయ్యాల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి తోకల పాపారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి తోకల రామకృష్ణ, సహాయ కార్యదర్శి మేడ బ్రహ్మయ్య, కోశాధికారి కుంభ ఏడుకొండలు, సంఘం నాయకులు పాల్గొన్నారు.



ఏకలవ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జై ఏకలవ్య అభ్యుదయ సేవా సంఘం నాయకులు

రామాయణం అంతట సీతా రాముల ఔన్నత్యం కనిపిస్తుంది



నగరంపాలెం: రామాయణం అంతట సీతా రాముల దాంపత్య ఔన్నత్యం కనిపిస్తుందని డాక్టర్ మరుధూరి నరసింహాచార్యులు అన్నారు. ఏటీ అగ్రహారం కంచి కామకోటి పీఠ శంకర, గాయత్రీ, దత్తసాయి, సత్యదేవ మందిరం(గాయత్రీ మాతా మందిరం)లో సంస్కృత భారతీ ఆధ్వర్యంలో సంస్కృత సప్తాహం శనివారం నిర్వహించారు. రామాయణం– దాంపత్యం అనే అంశంపై డాక్టర్ మరుధూరి నరసింహాచార్యులు మాట్లాడుతూ సీతాదేవికి దండకారణ్య కష్టంగా ఉండరాదని రాముడు ప్రయత్నించగా, సీత తన భర్తను ఒప్పించి అరణ్యానికి బయలుదేరిందని అన్నారు. ఎంత కష్టమైనా దంపతులు సుఖంగా అనుభవిస్తారని పేర్కొన్నారు. అరణ్యకాండలో దంపతులు చక్కని జీవితాన్ని గడిపారని చెప్పారు. అనసూయాదేవి సీతకు దాంపత్య ధర్మాలను తెలియజేసిందని అన్నారు. లోకానికి దాంపత్య వైభవాన్ని తెలియజేసిన గ్రంథం రామాయణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్కృత భారతీ గుంటూరు జిల్లా అధ్యక్షులు పి.సుబ్బారావు, గర్నేపూడి రాధాకృష్ణ, బృందావని, డాక్టర్ పెసల దేవేంద్రగుప్త పాల్గొన్నారు.

గుట్టుగా గుట్కా విక్రయాలు

పొన్నూరు: మండల పరిధిలోని గ్రామాలు, పట్టణంలోని విద్యాసంస్థల పరిసరాల్లో పొగాకు ఉత్పత్తుల (గుట్కా, ఖైనీ) విక్రయాలు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్నాయి. నిషేధిత ప్రాంతాల్లో విక్రయాలపై అధికారులు చర్యలు చేపడుతున్నా గుట్కా, ఖైనీ విక్రయాలకు అడ్డుకట్ట పడటం లేదు. పెట్టుబడి తక్కువ, లాభం ఎక్కువ రావడంతో పలువురు వ్యాపారులు అత్యాశతో అమ్మకాలు జరుపుతున్నారు. బడ్డీ, కిరాణా దుకాణాల్లో ఉంచి విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒక్క ప్యాకెట్ విక్రయిస్తే రూ.10 వరకు లాభం రావడంతో దుకాణదారులు వీటి అమ్మకాలపై ఆసక్తి చూపుతున్నారు. విద్యాసంస్థల పరిసర ప్రాంతాలలో ఖైనీ, గుట్కాల అమ్మకాలపై అధికారుల దాడులు కొన్నేళ్లుగా తగ్గుముఖం పట్టాయి. దీంతో ఆయా దుకాణాల్లో గుట్కా, ఖైనీలతో పాటు విదేశీ సిగరెట్ల అమ్మకాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి.

కేసులు నమోదు చేస్తున్నాం



ఆపరేషన్ సేఫ్ జోన్‌లో భాగంగా విద్యాసంస్థల వద్ద పొగాకు ఉత్పత్తులు విక్రయించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఇటీవల 15 మంది బడ్డీ, కిరాణా దుకాణ నిర్వాహకులకు రూ. 3 వేలు జరిమానా విధించాం. నిషేధిత ప్రాంతాల్లోని దుకాణ సముదాయాల్లో పొగాకు ఉత్పత్తుల విక్రయాల నియంత్రణకు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నాం.

– ఎల్. వీరా నాయక్, పట్టణ సీఐ, పొన్నూరు

గుంటూరులో 99 అడుగుల మట్టి గణపతి

విగ్రహ నమూనాను ఆవిష్కరించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

గుంటూరు రూరల్ : గుంటూరులో అమరావతి పేరుతో 99 అడుగుల మట్టి వినాయక విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమని కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఆయన కార్యాలయంలో వినాయక విగ్రహం నమూనా, ఉత్సవ ఏర్పాట్లు చెందిన వెబ్‌సైట్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ లేకుండా, ప్లాస్టిక్ వినియోగించకుండా ప్రకృతి సిద్ధమైన మట్టి, పుణ్య నదులైన గంగా, కృష్ణ, గోదావరిల నీటితో విగ్రహం తయారు చేయడం గొప్ప విషయమన్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ ఎం.నరేంద్ర మాట్లాడుతూ గణేశుని విగ్రహం వద్ద ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ వరకు 21 రోజులు నిత్య పూజలు, హోమాలు, యాగాలు జరుగుతాయన్నారు. ఇన్నర్‌రింగ్‌రోడ్డు, రెడ్డిపాలెం వద్ద ఈ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు రావడానికి దర్శించుకోవడానికి ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేసారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణరెడ్డి, తోట సాయికృష్ణ, జాకీరు, దామోదర్, గంటా స్వామి, దుర్గారెడ్డి, జి.విజయగౌరి తదితరులు పాల్గొన్నారు.



వినాయక విగ్రహ నమూనా ఫ్లెక్సీని ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

పర్యావరణ హిత నగరంగా తీర్చిదిద్దుదాం

జీఎంసీ కమిషనర్ పి.శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలకసంస్థ పరిధిలో మిషన్ గ్రీన్ గుంటూరు ద్వారా పచ్చని పర్యావరణహిత నగరంగా గుంటూరు రూపుదిద్దుకుంటుందని, కాలనీల, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు తమ ప్రాంతాల్లో మొక్కలు నాటి సంరక్షించుకోవాడానికి ముందుకు రావాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. శనివారం గోరంట్ల కోదండరామ నగర్‌లో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 300 మొక్కలు నాటే కార్యక్రమంలో కమిషనర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మిషన్ గ్రీన్ గుంటూరులో భాగంగా ఈ సీజన్లో నగరంలో దశల వారీగా 5 లక్షల మొక్కలు నాటేలా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశామన్నారు. ఇప్పటికే ప్రజా ప్రతినిధులను, జీఎంసీ అధికారులు, సచివాలయ కార్యదర్శులను, స్థానిక ప్రజలు, వివిధ స్వచ్ఛంద సంస్థలను భాగస్వాములను చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ మిషన్ గ్రీన్ గుంటూరులో పాల్గొని మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం వ్యక్తిగత బాధ్యతగా భావించినప్పుడు గుంటూరు నగరం పర్యావరణహితంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా కోదండరామ నగర్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులను అభినందించారు. అసోసియేషన్ ప్రెసిడెంట్ కె.నరసింహారావు, జనరల్ సెక్రటరీ బి.హనోక్, బి.గోపికృష్ణ, ఎ.సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న కమిషనర్ పి.శ్రీనివాసులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

కిల్కారి కాల్స్ సేవలు వినియోగించుకోవాలి

పెదకాకాని: మాత శిశు మరణాలు తగ్గించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కిల్కారి కాల్స్ ప్రవేశ పెట్టిందని ప్రోగ్రాం ఆఫీసర్ బి.రాజు తెలియజేశారు. మండల కేంద్రమైన పెదకాకానిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం ఆరోగ్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు కిల్కారి కాల్ గురించి అవగాహన కలిపించారు. కిల్కారి కాల్ యొక్క ప్రాముఖ్యత గురించి వివరించారు. కిల్కారి కాల్ సూచనలు పాటిస్తే సుఖ ప్రసవంతో పాటు తల్లి, బిడ్డ క్షేమంగా ఉంటారన్నారు. కిల్కారి కాల్స్ గర్భిణులకు 4వ నెల మొదలుకొని, బిడ్డ పుట్టిన సంవత్సరం వరకు వస్తాయన్నారు. ఈ కిల్కారి వాయిస్ కాల్స్ వారానికి ఒకసారి గర్భిణులు, బాలింతల మొబైల్స్‌కి వస్తాయన్నారు. గర్భిణులు, బాలింతలు కిల్కారి కాల్ నెంబర్ 01244451660ను తమ ఫోన్లలో సేవ్ చేసుకోవాలని సూచించారు. డాక్టర్ ప్రవీణ దీప్తి, పీహెచ్ఎన్ పద్మ, ఎంపీహెచ్ఎస్ సుకుమార్, హెచ్‌వి దేవి, మండలంలోని ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



పెదకాకాని పీహెచ్‌సీలో గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న ప్రాజెక్ట్ మేనేజర్ రాజు